క్లుప్తంగా

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



జడ్జీలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ధర్మవరం అర్బన్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్‌లో శనివారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం కిమ్స్ సవీరా ఆస్పత్రి సహకారంతో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని జడ్జీలు ప్రారంభించారు. శిబిరంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి జీఆర్‌బీఎస్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలను నిర్వహించారు. 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి సలహాలు అందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంపీ సుబ్బారావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



రేవతికి చెక్కు అందిస్తున్న ఏడీఎం హరిమోహన్

కదిరి అర్బన్: నల్లచెరువు మండలానికి చెందిన కొండారెడ్డి ఆర్టీసీ కండక్టరుగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి జిల్లా ప్రజారవాణా అధికారి రూ.లక్ష మంజూరు చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ డీఎం హరిమోహన్ మృతుడి భార్య మృతుడి భార్య రేవతికి చెక్కు అందజేశారు. నిబంధనల మేరకు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేందుకు బదులుగా ఈ నగదును అందించినట్లు ఏడీఎం తెలిపారు.

ఉత్తమ సేవలతో ప్రజల్లో గుర్తింపు



డాక్టర్ పద్మలత దంపతులను సన్మానిస్తున్న వైద్యులు

ధర్మవరం అర్బన్: ఉత్తమ సేవలతో ప్రజల్లో గుర్తింపు వస్తుందని డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ నజీర్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం బదిలీ అయిన డాక్టర్ పద్మలతను ఆసుపత్రి సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఓడీచెరువు: మల్లోల్లపల్లిలో వడ్డే వెంకటేశ్ అనే వ్యక్తి శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తనయుడు కిషన్ రెడ్డి గ్రామానికి చేరుకుని వెంకటేశ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా వుంటామని భరోసా ఇచ్చారు. చింతమానిపల్లి సర్పంచు జగన్ మోహన్ చౌదరి, ఎంపీటీసీ గణేష్‌రెడ్డి, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు వెంకట రంగారెడ్డి, చింతా రామిరెడ్డి ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో వైరు, ఆయిల్ చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దృశ్యం

బత్తలపల్లి: గుమ్మళ్లకుంట గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని రూ.35 వేలు విలువ చేసే ఆయిల్, వైరును ఎత్తుకెళ్లారు. ట్రాన్స్‌కో ఏఈ శివయ్య వివరాల మేరకు..విద్యుత్ అధికారులు గ్రామంలోని బయపరెడ్డి తోటలోని 25కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియన వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని 33 కేజీల కాపర్ వైరు, 65 లీటర్ల ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. ఈమేరకు ఏఈ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఏఈ మాట్లాడుతూ గతంలో బత్తలపల్లిలోని రిటైర్డ్ సీఐ రంగనాయకులు పొలం వద్ద కూడా ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి వైరు, ఆయిల్ ఎత్తుకెళ్లారన్నారు. నాలుగు రోజుల క్రితం బత్తలపల్లిలోని నార్సింపల్లి రోడ్డుకు గల పెద్ద వెంకటేష్ పొలంలో ఇలాగే చోరీకి పాల్పడుతూ పుట్టపర్తి మండలం ఎనుములపల్లి గ్రామానికి చెందిన మత్తినేని శ్రీరాములునాయుడు దొంగ విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలిపారు.

శ్రీసత్యసాయి జిల్లా వ్యతిరేకి టీడీపీ

- బాలకృష్ణ వ్యాఖ్యల్ని ఖండించలేని అసమర్థుడు 'పల్లె'
- జగనన్న ఆశీస్సులతో జిల్లా సాధించాం
- మళ్లీ గెలిచి జిల్లాను కాపాడుకుంటాం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



పుట్టపర్తిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఎస్సీ నాయకులు

పుట్టపర్తి రూరల్: తెలుగుదేశం పార్టీ శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటుకు వ్యతిరేకమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్ సర్కిల్, కుమ్మరిపేట, గోవిందపేట, జెండా వేపమాను వీధి, శివాలయం స్ట్రీట్, సత్యమ్మ సర్కిల్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి బాబా, ఆయన సోదరుడు దివంగత జానకిరామయ్య చిరకాల వాంఛ జిల్లా ఏర్పాటు అన్నారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి జగనన్న ఆశీస్సులతో శ్రీ సత్యసాయి జిల్లా సాధించామన్నారు. టీడీపీ హయాంలో పుట్టపర్తి కేంద్రంగా జిల్లాకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే హోదాలో పల్లె రఘునాథ్‌రెడ్డి బాలకృష్ణ ముందు మోకరిల్లి లెటర్ ఇచ్చారన్నారు. జిల్లాను మారుస్తామన్న బాలకృష్ణ వ్యాఖ్యలను ఖండించలేని అసమర్థుడు పల్లె అన్నారు. సత్యసాయి బాబా ఆశయాలు, సాయి భక్తుల మనోభావాలను బాలకృష్ణ, పల్లె దెబ్బతీశారన్నారు. పుట్టపర్తి నియోజకవర్గానికి మంజూరైన అగ్రికల్చర్ యూనివర్సిటీ అనంతపురానికి తరలించిన దుర్మార్గుడు పల్లె రఘునాథ్‌రెడ్డి అన్నారు. స్థానికేతరుడైన ఆయనకు ఈ ప్రాంతం అభివృద్ధిపై ఏమాత్రం ప్రేమ లేదన్నారు. ఈ జిల్లానే కాకుండా యావత్ రాష్ట్రంలో ఉండే సాయి భక్తులు జగనన్నను, తనను ఆశీర్వదించమని కోరారు. అందరి ఆశీస్సులతో మళ్లీ గెలిచి జిల్లాను కాపాడుకొని ఇంత అభివృద్ధి చేస్తామన్నారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తుపెట్టుకుంటాం

పుట్టపర్తి టౌన్: పార్టీ గెలుపుకోసం కష్టపడే ప్రతి కార్యకర్తను గుర్తు పెట్టుకొంటామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమితులైన ఎస్టీడీ నరసింహులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఎస్టీడీ నరసింహులు సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, మాజీ కౌన్సిలర్ సాయి, నాయకులు పైపల్లి నరసింహులు, గంగాద్రి, ఓబుళేసు,రామయ్య, సత్తెన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల సంక్షేమం



శివపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

కనగానపల్లి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ తెలిపారు. మండలంలోని శివపురం గ్రామంలో శనివారం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. నవరత్నాల్లోని పథకాలు నిరంతరంగా అందాలంటే తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, దృశ, కళల అకాడమీ స్టేట్ డైరెక్టర్ ప్రభాకర్, మండల అగ్రీ బోర్డు చైర్మన్ వెంకటరాముడు, స్థానిక ఎంపీటీసీ ఆదినారాయణరెడ్డి, సర్పంచ్ అంజినప్ప, నాయకులు రామలింగారెడ్డి, దాదాఖలందర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి



తనకల్లులో బైక్ ర్యాలీలో పాల్గొన్న బీఎస్ మక్బూల్ అహ్మద్



బీఎస్ మక్బూల్ అహ్మద్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన దృశ్యం

తనకల్లు: రాష్ట్రంలో సంక్షేమ పాలనకు మరోమారు పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ ప్రజలను కోరారు. రాచినేపల్లి, బండకాడపల్లి, చిన్నపల్లి, హరిజనవాడ, దిగువపల్లి, కాట్నేపల్లిలో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు బీఎస్ మక్బూల్ అహ్మద్‌కు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం నవరత్నాలు పథకాలతో లబ్ధి పొందిందని తెలిపారు. అందుకే సీఎం వైఎస్ జగన్ ప్రజలకు మంచి జరిగే ఉంటేనే ఓటు వేయాలని ధైర్యంగా అడుగుతున్నారన్నారు. అందరి ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని, జగనన్న మళ్లీ సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు తనకల్లు నుంచి రాచినేపల్లి వరకు భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, మైనార్టీ నేత సాదత్ అలీఖాన్, మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ రెడ్డెప్పనాయుడు, ఉప సర్పంచ్ శ్రీరాములు, నాయకులు శ్రీనివాసులనాయుడు, భక్తవత్సలరెడ్డి, బైక్ భాస్కర్‌రెడ్డి, సంజీవురెడ్డి దేశాయి, జనార్ధన్‌రెడ్డి, కొండా మల్లికార్జున, గణేష్ రెడ్డి, నీలకంఠారెడ్డి, అశోక్‌రెడ్డి, తబ్రేజ్, బాబా, నిజాం, వెంకటనర్సు, మనోహర్, నారాయణ, చలపతి, ఆదెప్ప, అంజినప్ప, నరసింహులు, చంద్రప్ప, వీరనరసప్ప, రమణప్ప, రామప్ప, ఆర్. రెడ్డెప్ప, ఆదినారాయణ, సురేంద్ర, శ్రీరాములు, నరేంద్ర, సిద్దారెడ్డి, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

తనకల్లు: వంకపల్లికి చెందిన టీడీపీ కార్యకర్తలు కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ సమక్షంలో శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఆయన కండువాలను కప్పి సాదరంగా పార్టీ ఆహ్వానించారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి నచ్చి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు డీ. రామాంజులు, అంజినప్ప, ఈ. రామాంజులు, వేమనారాయణ, కుళ్లాయప్ప తదితరులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామాంజులురెడ్డి, రాజారెడ్డి, శివరామిరెడ్డి, శ్రీకంఠారెడ్డి, రఫీ, శ్రీనివాసులురెడ్డి, రాజేష్‌కుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ఆంజినేయులు పాల్గొన్నారు.

న్యాయవాది పవన్ చేరిక

కదిరి టౌన్: పట్టణానికి చెందిన న్యాయవాది భూక్యా పవన్‌నాయక్ శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.ఆయనకు పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కులం, మతం, ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న పాలనకు ఆకర్షితుడై పార్టీలోకి చేరానని పవన్‌నాయక్ తెలిపారు.

20 కుటుంబాలు చేరిక

కదిరి అర్బన్: పందులకుంట, చలమకుంట్లపల్లికి చెందిన 20 టీడీపీ కుటుంబాలు శనివారం వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్ సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నామని వారు చెప్పారు. పార్టీలో చేరిన వారిలో హరినాథ్‌రెడ్డి, కొండారెడ్డి, జయచంద్రారెడ్డి, దస్తగిరి, రెడ్డెప్ప, ఫయాజ్, తేజేంద్రరెడ్డి, నరసింహారెడ్డి, నరసింహులు, రామయ్య, పెద వెంకట్‌రెడ్డి, మస్తాన్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నారపరెడ్డి, ఎంపీటీసీ కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్, ఎస్టీసెల్ నేత క్రిష్టానాయక్ పాల్గొన్నారు.

తలుపుల: మండల కేంద్రం దిగువపేటకు చెందిన 20 మంది టీడీపీ యువత మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ స్వగృహంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జ్ డీకే బాబు, మాజీ సర్పంచ్ చెన్నకృష్టారెడ్డి, మౌలా, హరి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలి



వెంకటనారాయణపల్లి క్రాస్ వద్ద చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ

అమడగూరు: చెక్‌పోస్టు వద్ద రోడ్డుపై వెళ్లే ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ భాగ్యరేఖ సిబ్బందికి సూచించారు శనివారం ఆమె బిళ్లూరు క్రాస్‌లో, వెంకటనారాయణపల్లి క్రాస్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లను పరిశీలించారు. అక్రమంగా మద్యం, డబ్బు సరఫరా చేస్తూ పట్టుబడితే ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియజేసి, నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఎన్నికలు ముగిసేంతవరకూ చెక్‌పోస్ట్‌లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామనాథరెడ్డి, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ మగ్బూల్‌బాషా, ఆర్ఐ ఈశ్వరయ్య, జమేదారు సుధాకర్ పాల్గొన్నారు.

ఓడీచెరువు: కర్ణాటక సరిహద్దులో ఉన్న సున్నంపల్లి, పెద్దగుట్లపల్లి చెక్‌పోస్టులను ఆర్డీఓ భాగ్యరేఖ శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిబ్బందికి తగు సూచనలు చేశారు ఆమె వెంట తహసీల్దార్ ఖాజాబీ, ఎస్ఐ వంశీకృష్ణ, ఆర్ఐ నాగేంద్ర, ఏఎస్ఐ కిశోర్ రెడ్డి ఉన్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించండి

ధర్మవరం అర్బన్: ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి సిబ్బందికి సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం సెక్టార్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లకు సార్వత్రిక ఎన్నికల విధులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం తాము పంపిన ప్రొఫార్మాను పూర్తి చేసి వెంటనే సమర్పించాలన్నారు. పోలింగ్ బూత్‌లలో అన్ని వసతులు ఉన్నాయా, లేదా వెంటనే పరిశీలించి తెలియజేయాలన్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరు బాత్‌రూంలు, ర్యాంపులు, గాలి, వెలుతురు, పోలింగ్ బూత్‌లు ఏ స్టేజీలో ఉన్నాయో తెలుసుకుని వాటిని సరి చేయాలని తెలిపారు. తహసీల్దార్ రమేష్, ఈడీటీ షణ్ముఖ యాదవ్ పాల్గొన్నారు.

ధాబాలు, హోటళ్లలో మద్యం అనుమతిస్తే కఠిన చర్యలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ధాబాలు, హోటళ్లలో మద్యం తాగేందుకు అనుమతిస్తే కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం సీఐ విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని చిన్నపాటి హోటళ్లు, ధాబాల్లో మద్యం తాగడం చట్టవిరుద్ధమన్నారు. ఇప్పటికే దాడులు నిర్వహించి పలువురిపై కేసులు నమోదు చేశామన్నారు. ధాబా యజమానులు, చిన్న చిన్న హోటళ్ల యజమానులను రూ.2 లక్షల పూచికత్తుతో తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామన్నారు. వాట్సాప్ గ్రూపులలో ఎవరైనా వివాదాస్పద వ్యాఖ్యలు చేసినా ఇతర పార్టీలను కించపరిచినట్లు పోస్టింగ్‌లు పెట్టినా అడ్మిన్‌లపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రచార వాహనాలకు డీజే అనుమతి లేదని ఎవరైనా డీజే పెట్టి సౌండ్ పొల్యూషన్ చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ముదిగుబ్బ: ఎన్నికల కోడ్ అమలుపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు సీఐ యతీంద్ర అన్నారు. శనివారం ముదిగుబ్బ పోలీస్ స్టేషన్‌లో వాట్సాప్ గ్రూపుల అడ్మిన్లతో సమావేశాన్ని నిర్వహించారు. సోషల్ మీడియా గ్రూపులలో పెట్టే ప్రతి పోస్టులకు గ్రూపు అడ్మిన్‌గా బాధ్యులుగా వుంటారన్నారు.

కాటికోటేశ్వర బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలందుకున్న కాటికోటేశ్వరుడు

బత్తలపల్లి: సంజీవపురంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు ధనుంజయ శర్మ సుప్రభాత సేవలతో స్వామిని మేల్కొలిపి నిత్యకట్ల కైంకర్య సేవలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో కాటికోటేశ్వరున్ని సుగంధ ద్రవ్యాలతో శుద్ధి చేశారు. క్షేత్రంలో వ్యాపారులు అంగళ్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. గ్రామంలోని కాటమయ్య స్వామిని పెళ్లి కొడుకును చేసి ఊరేగించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి మూలస్థానమైన ఈదులముష్టూరు నుంచి పల్లకీలో స్వామి మూలవిరాట్‌ను కాటికోటేశ్వర క్షేత్రంలోకి తీసుకొస్తారు. అక్కడ ఆలయ ధర్మకర్తలు తొలిపూజలు చేయనున్నారు. ఆ రోజు పరిసర గ్రామాల వారు పానకం బండ్లతో కాటమయ్య కొండ చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఆ రాత్రి పూజలు, భజనలు విశేషంగా జరుగుతాయి. ఇదిలా ఉండగా బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు, పది మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 35 మంది కానిస్టేబుళ్లు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ముష్టూరు నరసింహారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఓబిరెడ్డి, రాజసింహారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, దేవేంద్రరెడ్డి, ఆనందరెడ్డి, గంగాధరరెడ్డి, నాగిరెడ్డి, శివారెడ్డి, లింగారెడ్డి, నల్లపరెడ్డి, నిరంజన్‌రెడ్డి, పాటిల్ ఓబిరెడ్డి, శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ యువతకు ఆదర్శం

ధర్మవరం అర్బన్: దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ యువతకు ఆదర్శమని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర తెలిపారు. పట్టణంలోని ప్రగతిశీల విద్యార్థి సంఘం కార్యాలయంలో శనివారం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు హరికృష్ణ, భరత్, నవీన్, పవన్, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేతల అరెస్టు

ధర్మవరం అర్బన్ : పట్టణంలోని సాయినగర్‌లోనున్న హోటల్ వద్ద ఆంధ్ర, కర్ణాటక మద్యం అమ్ముతున్న వనం లక్ష్మీనారాయణ, అతని భార్య వనం గంగమ్మను పోలీసులు శనివారం పట్టుకున్నారు. వారి నుంచి 3 ఆంధ్ర లిక్కర్, 10 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణంలో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్ముతున్నా, రవాణా చేసినా గంజాయి అమ్మినా మట్కా ఆడినా 9440796831 నంబరుకు సమాచారం అందించాలని తెలిపారు. దాడుల్లో ఏఎస్ఐ పుట్టప్ప, కానిస్టేబుళ్లు అబ్దుల్, శశికళ పాల్గొన్నారు.

అనారోగ్యంతో కుమ్మర సంఘం సభ్యుడి మృతి

బత్తలపల్లి: మండల కేంద్రంలో శనివారం కుమ్మర శాలివాహన సంఘం సభ్యులు మదనాపు నాగభూషణ(62) అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప తదితరులు నాగభూషణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుమ్మర సంఘం సభ్యులు బాపనపల్లి వెంకటరమణ, మదనాపు ఆదినారాయణను మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

నల్లమాడ: మండలంలో ఇసుక, చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. మండలంలో కొంతమంది ఇసుక డంప్ చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు, జేసీబీ యజమానులు చెరువుల్లోని మట్టిన అక్రమంగా తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. చెరువు నుంచి మట్టిని తవ్వి తరలించాలంటే తహసీల్దార్ లేదా నీటి పారుదల అధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు.

పుట్టపర్తి కోర్టు పనితీరు బాగుంది



ఏడీజే శోభారాణికి పుష్పగుచ్ఛం అందిస్తున్న న్యాయవాదులు

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి కోర్టు పనితీరుపై 4వ అదనపు జిల్లా జడ్జి శోభారాణి సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం పుట్టపర్తి కోర్టును ఆమె పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ న్యాయవాదులు కేసుల పట్ల అంకితభావంతో ఉండాలన్నారు. అప్పుడే కేసులు సత్వరం పరిష్కారమవుతాయన్నారు. జూనియర్ సివిల్ జడ్జ్ రాకేష్ ఉన్నారు. ఇదిలా ఉండగా ఏడీజే శోభారాణిని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి న్యాయవాదులు యదుభూషణ్, కృష్ణమూర్తి, అబూబకర్, హరికృష్ణ గౌడ్, నాగేంద్ర, ఇందిరా తదితరులు సత్యసాయి బాబా చిత్రపటాన్ని అందజేసి శాలువాలతో సత్కరించారు.

తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు

నల్లచెరువు: సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణలు, తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ లింగన్న పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ వివాదాస్పద పోస్టులకు దూరంగా ఉండాలన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మృతి




నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: బుక్కపట్నంకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పుచ్చకాయల కొండయ్య (66) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి కొండయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, బూత్ లెవెల్ కన్వీనర్ పతంజలి, ఈశ్వర్, నారాయణస్వామి పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

తాడిమర్రి: మండలంలోని కునుకుంట్ల, చిల్లవారిపల్లి, రామాపురం, పుల్లానారాయణపల్లి, నిడిగల్లు, ఆత్మకూరు, మరవపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు శనివారం బీసీజీ, పోలియో, నిమోనియా, పెంటా, ఎంఎమ్మార్ తదితర టీకాలు వేశారు. అనంతరం వైద్యసిబ్బంది చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఏఎన్ఎంలు కోమలి, కృష్ణమ్మ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

'స్థాయిని మరచి ఆరోపణలు చేయడం తగదు'



విలేకరులతో మాట్లాడుతున్న వజ్ర భాస్కర్‌రెడ్డి

కదిరిటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ నేత కందికుంట ప్రసాద్ తనస్థాయిని మరచి విమర్శలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి శనివారం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోర్టులో తాత్కాలిక ఉపశమనం మాత్రమే కలిగిందని, త్వరలో కందికుంట ప్రసాద్ జైలుకెళ్లడం ఖాయమన్నారు. కందికుంటపై ఉన్న దొంగ డీడీల కేసుకు.. టీడీపీ, కాంగ్రెస్ కలిసి కడుపు మంటతో జగనన్నపై రాజకీయంగా కక్ష సాధించాలని వేసిన కేసుతో ముడిపెట్టడం అతని అజ్ఞానాన్ని తెలియజేస్తోందన్నారు. కందికుంట రాజకీయాల్లోకి రాక ముందు ఏం చేసేవాడో కదిరి ప్రజలకు బాగా తెలుసన్నారు. ఆయన మాటలు వింటుంటే గురివింద సామెత గుర్తొస్తుందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ గ్రిడ్, రాజధాని భూములు కేసులో స్క్వాష్ పిటీషన్‌ను తిరస్కరించి కోర్టు చంద్రబాబుకు మొట్టికాయలు వేయలేదా కందికుంటా అని ప్రశ్నించారు. కదిరి గడ్డపై ముచ్చటగా మూడో సారి ఓడించకపోతే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. మరో సారి తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఇలాంటి మాటలు మాట్లాడితే నీ నేర చరిత్ర బయట పెట్టి నీకు రాజకీయ సమాధి కడతామన్నారు.

సంక్షిప్త సమాచారం

రేపు భంభం బాబా ఆరాధనోత్సవాలు

ధర్మవరం: మైసూరు సర్వధర్మ ఆశ్రమ నిర్వాహకులు, భంభం బాబా పీఠాదిపతి భం కబీర్ కిరణ్‌స్వామి ఆధ్వర్యంలో ధర్మవరంలో సోమవారం స్వామి ఆరాధనోత్సాలు నిర్వహించనున్నట్లు పీఠం ప్రతినిధి కేఎం బాషా కోరారు. శనివారం సాయంత్రం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో విలేకరులతో మాట్లాడారు. ధర్మవరంలోని సీబీఎస్ గార్డెన్స్‌లో భం షేక్ అబ్దుల్ స్వామి 55వ, సద్గురు భం అన్వరానంద బాబా 21వ ఆరాధనోత్సవాలు ఉదయం 7.30 గంటలకు కుంభాబిషేకంతో ప్రారంభమతాయన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

నల్లచెరువు: ఈ నెల 8న చిన్నపల్లోల్లపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓరువాయి గ్రామస్తుడు వెంకటరమణ (57) శనివారం మృతి చెందాడు. ఎస్ఐ లింగన్న కేసు నమోదు చేశారు.

ఫ్యాక్షన్ గ్రామాల్లో పోలీసుల కవాతు

కనగానపల్లి(రామగిరి): మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలైన నసనకోట, కలికివాండ్లపల్లిలో శనివారం కవాతు (ఫ్లాగ్ మార్చ్) నిర్వహించినట్లు రామగిరి సీఐ శివాంజినేయులు తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. స్థానిక రచ్చబండల వద్ద ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు, శాంతిభద్రతలపై వివరించారు.